సార్వా వరిపై మూషిక దాడి

- చిరుపొట్ట, ఈనిక దశలో ఎలుకల విజృంభణ
- ఒక ఎలుకను పట్టుకునేందుకు రూ.100 ఖర్చు
- ఎకరాకు రూ.3 వేల పైగా వ్యయం


గణపవరంలో ఎలుకలు కొరికేసిన వరిని ఏరుతున్న రైతులు

గణపవరం: సార్వా రైతులకు మూషికాల బెడద పెద్ద తలనొప్పిగా తయారైంది. ఖరీఫ్ పంటపై మూషికాలు మూకుమ్మడి దాడి చేస్తూ, వరిని కొరికి పాడు చేస్తున్నాయి. ప్రస్తుతం వరిపైరు పొట్టదశ, ఈనిక, గింజ పాలు పోసుకునే దశలలో ఉంది. ఈ దశలో వరి మొక్క తీపిగా ఉండటంతో ఎలుకలు వరి దుబ్బులను కొరికి వేస్తున్నాయి. పది రోజులుగా ఏ ఆయకట్టులో చూసినా ఎలుకలు కొరికివేసిన వరిని ఏరుతున్న రైతులు, కూలీలు, ఎలుకలను పట్టే దృశ్యాలే కనిపిస్తున్నాయి. ఎలుకల నిర్మూలనకు రైతులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండటంలేదు. ఒక వైపు తెగుళ్లు, మరో వైపు ఎలుకల బెడదతో రైతులకు ఊపిరి సలపడం లేదు. ఎలుకల బుట్టలు పెట్టడం, బొరియలు తవ్వి పొగ బెట్టడం, ఎలుకల మందు బిళ్లలు బొరియల్లో వేయడం ద్వారా ఎలుకల బెడద వదిలించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కలుగుతవ్వి ఎలుకను పడితే రూ.60, బుట్టలో పడితే ఎలుకకు రూ.100 చొప్పున రైతులు చెల్లిస్తున్నారు. ఎన్ని ఎలుకలను పట్టినా, మళ్లీ పొలాలలోకి ఎలుకలు చేరుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

సార్వాకు పెరిగిన పెట్టుబడి

ప్రస్తుత సార్వాకు రైతులకు పెట్టుబడి ఖర్చులు విప రీతంగా పెరిగిపోయాయి. సార్వా నారుమడులు, నాట్ల దశలో భారీ వర్షాలకు మొత్తం నారుమడులు, వరినాట్లు నీటమునిగి కుళ్లి పనికిరాకుండా పోయా యి. దీనితో రెండోసారి నారుమడులు, వరినాట్లు వేశారు. గత నెలలో రెండోసారి కురిసిన భారీ వర్షాలకు మళ్లీ 50 శాతం వరకూ వరి నాట్లు పనికిరాకుండా పోవడంతో రైతులు బయటి జిల్లాల నుంచి నారుకొని తెచ్చి నాట్లు వేసుకున్నారు. దీనితో సార్వాకు పెట్టుబడి దాదాపు రెట్టింపయింది.

నియోజకవర్గంలో వరి సాగు వివరాలు

మండలం	హెక్టార్లు
గణపవరం	6,150
భీమడోలు	6,300
నిడమర్రు	4,600
ఉంగుటూరు	9,100

ఆక్వా సాగుతో పెరిగి ఎలుకల సంతతి

ఉంగుటూరు నియోజకవర్గంలో ఆక్వా సాగు ప్రతి గ్రామంలోనూ కొనసాగుతోంది. ఎత్తుగా ఉండే ఆక్వా చెరువుల గట్లపైన, మేతలు నిల్వచేసే పాకలు, షెడ్లలో ఎలుకలు మకాం పెడుతున్నాయి. రాత్రి వేళల్లో సమీప పంట పొలాల్లోకి చేరి వరి పైరును కొరికి పాడు చేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆక్వా రంగం కారణంగా ఎలుకల సంతతి మాత్రం బాగా వృద్ధి చెందుతోంది. ఇవి పంట పొలాల్లోకి వచ్చి ఇష్టారాజ్యంగా పంటను పాడు చేస్తున్నాయి.

కూలి ఖర్చులు తడిసి మోపెడు

ఎలుకలు కొరికిన వరిని ఏరడానికి కూలీ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి.ప్రతి రోజూ ఇద్దరు లేదా ముగ్గురు కూలీలను నియమించి ఎలుకలు పాడుచేసిన వరి ఏరివేతకు రూ.800 నుంచి రూ. వెయ్యి అవుతోందని రైతులు వాపోతున్నారు. ఎలుకలు కొరికి వేసిన వరిని కట్టలు కట్టి పశువులకు మేతగా వేస్తున్నారు. ఎలుకలు చేలల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ వరి దుబ్బులు కొరికి వేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఎలుకల మందు పంపిణీకి సిద్ధం



ప్రస్తుతం సార్వా పైరు ఈనిక, గింజ పాలు పోసుకునే దశలో ఉంది. ఈస్థితిలో వరిని ఎలుకలు ఎక్కువగా పాడు చేస్తాయి. రైతులకు ఎలుకల మందు పంపిణీకి సిద్ధంగా ఉన్నాం. వారంలోనే ఎలుకల మందు రైతులకు ఇవ్వడానికి ఏర్పాట్లు చేయగా వర్షాల కారణంగా పంపిణీ చేయలేదు. అక్టోబర్ 2, 3 తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులకు ఎలుకల మందు ఉచితంగా అందజేస్తాం.

– యర్రంశెట్టి ప్రసాద్,
మండల వ్యవసాయ అధికారి, గణపవరం


ఎలుకల బొరియల్లో పొగపెడుతున్న దృశ్యం


ఎలుకలు కొరికివేసిన వరి


ఎలుక కన్నాలను గుర్తిస్తున్న రైతులు

క్లుప్తంగా

అవగాహనతో సత్ఫలితాలు


వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

దెందులూరు: ప్రజాభాగస్వామ్యంతోనే ప్రభుత్వ పథకాలు విజయవంతమవుతాయని తద్వారా సత్ఫలితాలు లభిస్తాయని దెందులూరు ఎంపీడీవో వీ శ్రీలత అన్నారు. సోమవారం మండల పంచాయతీలు విస్తరణాధికారి మూర్తి, ఎంపీడీవో సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ర్యాలీలు సమావేశాలు నిర్వహించారు. సీతంపేట గ్రామ సచివాలయంలో సర్పంచ్ పరసా లక్ష్మీ సుజాత ఆధ్వర్యంలో వైద్య అంగన్వాడీ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు శ్రీవర్మ ఎంపిక



గణపవరం: నర్సాపురం మండలం ఎల్బీచర్ల హైస్కూల్లో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు గణపవరం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎం.అఖిల్ శ్రీవర్మ ఎంపికైనట్లు పీడీ పద్మావతి తెలిపారు. కడపలో నిర్వహించే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో శ్రీవర్మ పాల్గొంటాడన్నారు. శ్రీవర్మను, అతనికి శిక్షణ ఇచ్చిన పీడీ పద్మావతిని, హెచ్ఎం మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం


గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్వాడీ అధికారులు, ఆరోగ్య సిబ్బంది

భీమడోలు: చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని భీమడోలు అంగన్వాడీ సూపర్వైజర్ ఎండీ షహనాజ్బేగం అన్నారు. భీమడోలు పంచాయతీ శివారు ఆర్జావారిగూడెం-1 అంగన్వాడీ కేంద్రంలో భీమడోలు సెక్టార్ పరిధిలో సోమవారం పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. షహనాజ్ బేగం మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో అందించే సేవలను వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. తొలుత చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. వైద్య ఆరోగ్య శాఖ ఏఎన్ఎంలు వెంకటలక్ష్మి, మురళి అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సహకారంతో సొసైటీ లాభాల బాట


సమావేశంలో మాట్లాడుతున్న చైర్పర్సన్ కురిచేటి నర్సింహమూర్తి

ఉంగుటూరు: నారాయణపురం సహకార సొసైటీ ఏడాది కాలంలో 2023-24లో రూ.77 లక్షలు ఆర్జించినట్లు సొసైటీ చైర్పర్సన్ కురిచేటి నర్సింహమూర్తి వెల్లడించారు. సోమవారం సొసైటీలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో నర్సింహమూర్తి మాట్లాడుతూ సొసైటీ లాభాలు ఆర్జించడంలో రైతులు సహకారం ప్రోద్బలం ఎంతో ఉందని అన్నారు. సొసైటీ రూ.118 కోట్లు టర్నోవర్ నడుస్తోందని తెలిపారు. సొసైటీ వ్యవహారాలన్నీ ఆన్లైన్లో పూర్తిస్థాయిలో పొందుపరుస్తామన్నారు. 22 వేల అకౌంట్లు ఆన్లైన్ అయ్యాయని అన్నారు. రైతులకు వ్యక్తిగత రుణం పరిమితిని పెంచే విషయమై సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం ఉన్న షేరు ధనం రూ.4 కోట్ల నుంచి రూ.8 కోట్లకు పెంచుతూ బైలా సవరణపై చర్చించారు. మాజీ ఎంపీపీ గోలి శ్రీనివాసరావు, రామచంద్రరావు మాట్లాడారు. సొసైటీ సెక్రటరీ యర్రా శ్రీనివాసరావు నివేదికను చదివి వివరించారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

ఏలూరు (ఆర్ఆర్పేట): అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. బీఆర్ అంబేడ్కర్ ఏలూరు విచ్చేసి 80 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సెట్వెల్ సీఈఓ కె.ప్రభాకర్, ఆర్ఐఓ చంద్రశేఖర్, ఇరిగేషన్ డీఈఈ దేవరకొండ వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎం రాంబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 1944 సెప్టెంబర్ 30న ఏలూరు రావడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. దళిత బహుజన సంఘాల నాయకులు నేతల రమేష్ బాబు, చాగంటి సంజీవ్, ఐఆర్ఎస్ ఆర్ అండ్ బీ రిటైర్డ్ డీఈఈ గరికిముక్కు వెంకటేశ్వరరావు, దాసరి నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో భవిష్యత్తుకు అనర్థం


ప్లాస్టిక్ వస్తువుల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

దెందులూరు: ప్లాస్టిక్ వస్తువుల వాడకంతో పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి అనర్థమని దెందులూరు ఎంపీడీవో వి శ్రీలత అన్నారు. సోమ వారం దెందులూరు 10వ వార్డు సెంటర్లో దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. నర్సింగ్ కళాశాల విద్యార్థులు నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం జూట్ వస్తువులను ప్రదర్శించారు. ఎంపీడీవో శ్రీలత ఏలూరు సర్పంచ్ తోట ఏసమ్మ, వైద్య సిబ్బంది, గ్రామ కార్యదర్శి వీఎస్ చౌదరి సచివాలయ ఉద్యోగులు ప్లాస్టిక్ వస్తువులను వాడవద్దని నినాదాలు చేశారు. సర్పంచ్ తోట ఏసమ్మ మాట్లాడుతూ సమాజానికి మేలు చేసే అంశాలపై దెందులూరు నర్సింగ్ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

దెందులూరు: సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయం వచ్చి వినతులు ఇచ్చిన వెంటనే పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని దెందులూరు ఎమ్మెల్యే ప్రభాకర్ అన్నారు. సోమ వారం తహసీల్దార్ కార్యాలయం మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇకపై ప్రతి సోమ వారం నాలుగు మండలాల్లో ఏదో ఒక తహసీల్దార్ కార్యాలయంలో హాజరవుతానన్నారు. అనంతరం ప్రజలు ఇచ్చిన వినతిపత్రాలను స్వీకరించారు. తహసీల్దార్ బి సుమతి, ఎంపీడీవో వీ శ్రీల త, ఎంఈఓ కే. అన్నమ్మ, అధికారులు, నాయకులు క్లస్టర్ ఇన్చార్జ్ గారపాటి కొండయ్య చౌదరి, యిప్పిలి వెంకటేశ్వరరావు, పెనుబోయిన మహేష్ యాదవ్ ఉన్నారు.

చంద్రబాబు అసత్య ప్రచారాలు మానుకోవాలి


అప్పన ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్

దెందులూరు: చంద్రబాబు అసత్య ప్రచారాలు, దుర్మార్గపు ఆలోచనలు ఇకనైనా మానుకోవాలని దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎస్సార్సీపీ సీనియర్ నేత అప్పనప్రసాద్ అన్నారు. రాబోయే క్రిస్మస్, రంజాన్ పండుగలకు కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు డిక్లరేషన్ఇచ్చి పాల్గొంటారా అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్తోపాటు కూటమి నాయకులు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి డిక్లరేషన్ లేకుండా తిరుమల తిరుపతి దేవస్థానానికి ఎలా వెళతారని ప్రశ్నించడం అర్థరహితమని అన్నారు. ఈ సూత్రం కూటమి నాయకులకు కూడా వర్తిస్తుందని వారంతా క్రిస్మస్, రంజాన్ వేడుకల్లో పాల్గొనేందుకు చర్చిలు, మసీదుల్లోకి ప్రవేశించినప్పుడు డిక్లరేషన్ ఇవ్వాలని ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను గమనిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు అమలు గాని హామీలు ఇచ్చి మోసపూరితంగా వ్యవహరించి అధికారం చేపట్టిన తర్వాత సూపర్ సిక్స్ను చూస్తే భయమేస్తోందని సీఎం చంద్రబాబు చెప్పడం వెనుక కుట్ర కోణం ఉందని అన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేక తను వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాలను డైవర్ట్ చేయడానికి ఏకంగా దేవుడి పేరుతో రాజకీయం చేశారన్నారు. ఒకవైపు తిరుమల తిరుపతి దేవస్థా నం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిబంధనలకు అనుగుణంగా లేని నెయ్యిని వెనక్కితిప్పి పంపేశామని విలేకరుల సమావేశంలో చెప్పారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం లడ్డూ తయారీలో కలుషిత నెయ్యి కలిపారని అసత్యప్రచారంచేస్తూ దుర్మార్గానికి పాల్పడుతున్నారని అన్నారు. లడ్డూ పేరిట చంద్రబాబు చేస్తున్న రాజకీయం వికటించిందని, సాక్షాత్తు ఆ వేంకటేశ్వరస్వామి సుప్రీంకోర్టు రూపంలో కల్తీ జరగలేదని, ఆధారాలులేవని చెప్పించారని అన్నారు. ఇకనైనా చంద్రబాబు, కూటమి నాయకులు దేవుడితో రాజకీయాలు చేయవద్దని అప్పన ప్రసాద్ అన్నారు.

కులవివక్ష చట్టవిరుద్ధం


వల్లూరులో పౌరహక్కుల సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

గణపవరం: గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి సోదరభావంతో ఉండాలని, కులవివక్ష పనికిరాదని అది చట్టవిరుద్ధమైనదని జిల్లా ఎస్సీ,ఎస్టీ సెల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. సోమవారం గణపవరం మండలం వల్లూరులో తహసీల్దార్ అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన పౌరహక్కుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పౌరుల హక్కులకు ఎవరు భంగం కలిగించినా వారు న్యాయంకోసం అధికారులను సంప్రదించాలని సూచించారు. తహసీల్దార్ అప్పారావు మాట్లాడుతూ ప్రతి నెలా చివరి రోజున ఒక గ్రామంలో పౌర హక్కుల సదస్సు ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ ముచ్చర్ల వేణు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను విరమించాలి

గణపవరం: ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజుకోరారు. ఈమేరకు మాలమహానాడు నాయకులతో కలిసి సోమవారం గణపవరం తహసీల్దార్కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టవిరుద్ధమైనదని, దళితుల మధ్య చిచ్చురేపే వర్గీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలని కోరారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు విప్పర్తి దివాకర్, మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు సెకండ్ సెమిస్టర్ పుస్తకాల పంపిణీ


పాతూరులో చిన్నారులకు రెండో సెమిస్టర్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న టీచర్లు, ఎస్ఎంసీ సభ్యులు

భీమడోలు: పాఠశాలలకు చేరిన రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను బాలబాలికలకు అందించారు. ప్రభుత్వం పుస్తకాల భారాన్ని తగ్గించేందుకు సిలబస్ను రెండు సెమిస్టర్లుగా విభజించి బాలబాలికలకు ఏటా రెండు విడతలుగా వారికి పాఠ్య పుస్తకాలను అందిస్తుంది. ఈ మేరకు అక్టోబర్ నుంచి రెండో సెమిస్టర్ సిలబస్ ప్రారంభం కావడంతో బాలబాలికలకు జాతీయ పాఠ్యపుస్తకాలను అందించారు. మండలంలోని 44 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో చదువుకుంటున్న బాలబాలికలకు పుస్తకాలను అందించామని ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్కుమార్ తెలిపారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పి.నిర్మలకుమారి ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలలోని 32 మంది చిన్నారులకు పాఠ్యపుస్తకాలను అందించారు. లెక్కలు, సైన్స్ సబ్జెక్టుల పుస్తకాలు, వర్క్ బుక్స్ను అందించారు. ఈ కార్యక్రమంలో టీచర్ మండే సుధాకర్, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ షీమా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైల్వే గేటు వద్ద పై వంతెన నిర్మిస్తే ఆందోళన చేస్తాం


భీమడోలులో నిర్వహించిన మీకోసంలో వినతిపత్రం అందిస్తున్న రైల్వే గేటు ప్రాంత వాసులు

భీమడోలు: భీమడోలు రైల్వే పై వంతెన నిర్మాణం చేపడితే తామంతా నిర్వాసితులవుతామని, వంతెనను ఊరి బయట నిర్మించాలని భీమడోలు రైల్వే గేటు ప్రాంత వాసులు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వద్ద భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుకు వినతిపత్రాన్ని అందించారు. తమ సమస్యను ఉన్నతాధికారులు, రైల్వే శాఖ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించాలని వారంతా వేడుకున్నారు. జాతీయ, రాష్ట్రీయ రహదారులను కలిపేలా భీమడోలు రైల్వే గేటు వద్ద పై వంతెన నిర్మించేందుకు రైల్వే శాఖ ప్రాథమిక సర్వే చేసిందని, దీని వల్ల ఈ ప్రాంతంలోని వ్యాపారాలు, గృహాలు కోల్పోయి ప్రజలంతా రోడ్డున పడతారని అన్నారు. ఆ వంతెనను ఊరి బయట వడ్లపట్ల మీదుగా భీమడోలు వైపుగా నిర్మిస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందన్నారు. రామిశెట్టి గోపి, గోనుగుంట రమణశంకర్, యెగ్గిన గంగాకమలాకర్, ఉండ్రు బెంజిమన్, కుక్కల ప్రసాద్, యుగంధర్ పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు

దెందులూరు: మండలంలో 17 పంచాయతీల్లో 9,495 మంది వివిధ రకాల లబ్ధిదారులకు అక్టోబర్ 1న పెన్షన్ల నగదు మంజూరు చేయడం జరుగుతుందని దెందులూరు ఎంపీడీవో వి శ్రీలత అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ఐసీడీఎస్, వైద్య, అంగన్వాడీ, ఉద్యోగులు పెన్షన్ నగదు ఇస్తారన్నారు. ఎంపీడీవో, ఏఓ, ఈఓపీఆర్ పెన్షన్ నగదు పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

హుండీ దొంగ అరెస్టు

గణపవరం: కేశవరంలోని ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు గణపవరం ఎస్సై మణికుమార్ తెలిపారు. కేశవరానికి చెందిన ముద్దుర్తి గణేష్ చెడు వ్యసనాలకు బానిసై హుండీ దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. ముద్దాయిని సోమవారం అరెస్టు చేసి తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపరచినట్లు ఆయన తెలిపారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

నిడమర్రు: ఉత్తమ సేవలందించే ప్రభుత్వ ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని ఏపీటీఫ్ స్టేట్ ఆడిట్ కమిటీ సభ్యులు షేక్ రంగావళి అన్నారు. సోమవారం బావాయిపాలెం జెడ్పీస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో సోమవారం పదవీ విరమణ చేస్తున్న ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. హరినాథ్ను ఏపీటీఎఫ్ జిల్లా శాఖ తరుపున ఘనంగా సత్కరించారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నిమ్మల జయప్రకాశ్ నారాయణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐఎస్వీవీ ప్రసాద్ తదితరులున్నారు.

బాలల వసతి గృహం తనిఖీ

దెందులూరు: కొవ్వలిలో సాంఘిక సంక్షేమ బాలల వసతి గృహాన్ని సోమవారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు దోమల నెట్లు ఏర్పాటు చేయాలని, మురుగు నీరు పోయేలా డ్రెయిన్ పైపులు సిద్ధం చేయాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

ఆకతాయిలపై చర్యలు తీసుకోండి

దెందులూరు: కొవ్వలి హైస్కూల్ విద్యార్థులను వేధిస్తున్న ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని గ్రామ నాయకులు కే రామకృష్ణ సుధాకర్ కోరారు. దీనిపై సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ హేమమాలినికి ఆయన లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఉన్నత పాఠశాలకు వెళ్లేటప్పుడు వచ్చేటప్పుడు విద్యార్థులను గ్రామంలోని కొందరు ఆకతాయిలు భరించలేని విధంగా వేధిస్తున్నారని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఉత్సాహంగా ఫ్రెషర్స్డే


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నిర్మలకుమారి

గణపవరం: స్థానిక చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం నిర్వహించిన ఫ్రెషర్స్డే వేడుకలు విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య ఉత్సాహభరితంగా వాతావరణంలో కొనసాగాయి. సీనియర్ విద్యార్థులు జూనియర్లను సాదరంగా కళాశాలలోకి ఆహ్వానించి వారితో కరచాలనాలు చేశారు. ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులతో ఆనందంగా గడిపారు. సోమవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన ఫ్రెషర్స్డే వేడుకలలో ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి మాట్లాడుతూ విద్యార్థులంతా సోదరభావంతో మెలగాలని, ర్యాగింగ్కు దూరంగా ఉండాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపల్ మధురాజు, సర్పంచ్ మూర అలంకారం, కూటమి నాయకులు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీరామ్, సత్యనారాయణరాజు, డి.సత్యనారాయణ రూ.30 వేల విరాళం ప్రిన్సిపల్కు అందించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గంటా అన్నవరం, శ్రీను, సీహెచ్ చైతన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా బస్టాండ్ రోడ్డు


భీమడోలు బస్టాండ్లోని గోతుల్లో వేసిన మట్టి


భీమడోలు బస్టాండ్లో గోతుల్లో వేసి మట్టితో అధ్వానంగా మారిన రోడ్డు

భీమడోలు: ద్వారకాతిరుమల దేవస్థానానికి వెళ్లే ప్రయాణికులు, బస్సులుతో నిత్యం రద్దీగా ఉండే భీమడోలు బస్టాండ్ రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. ఆవరణమంతా ఛిద్రమై గోతులమయమై ప్రమాదాలకు నిలయంగా మారింది. వర్షాలకు బురదనీటితో నిండిన గోతుల్లో ప్రయాణికులు, భక్తులు పడి గాయాలపాలవుతున్నారు. గోతులను పూడ్చేందు కు సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ప్రైవేటు వ్యక్తులు మట్టి పోశారు. వర్షం కారణంగా రోడ్డంతా బురదమయమై వాహనదారులు, భక్తులు, ప్రయాణికుల పాలిట ప్రాణసంకటంగా మారింది. ఈ బస్టాండ్ నుంచి ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. స్థానికులు సమస్యను ద్వారకాతిరుమల దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినా స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్లోని గోతులను పూడ్చాలని, ప్రయాణికులకు మౌలిక వసతులు సమకూర్చాలని భక్తులు కోరుతున్నారు.

హిందూ సమాజానికి చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

దెందులూరు: చంద్రబాబు, పవన్ కల్యాణ్ హిందువులకు క్షమాపణ చెప్పాలి, దెందులూరు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసాదమైన పవిత్రమైన లడ్డూలో కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కల్యాణ్ చెప్పటం బాధ్యతారాహిత్యమని వైఎస్సార్సీపీ నాయకులు డీబీఆర్కే చౌదరి అన్నారు. సోమవారం దెందులూరు ప్రెస్క్లబ్లో ఆయన మాట్లాడుతూ సాక్షాత్తు తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తేడా ఉన్న నెయ్యి ట్రాక్టర్లను వెనక్కి పంపేశామని ఆ నెయ్యిని లడ్డూలో వాడలేదని చెప్పారన్నారు. టీటీడీ ఈవో చెప్పినప్పటికీ చంద్రబాబు మాత్రం ఎటువంటి ఆధారాలు లేకుండా విచారణ జరపకుండా వైఎస్సార్సీపీకి అంటగట్టేలా లడ్డూపై రాజకీయం చేయడం తగదన్నారు. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేంకటేశ్వర స్వామి భక్తులను హిందువులను కించపరచటమేనన్నారు. తక్షణమే చంద్రబాబు, పవన్ కల్యాణ్ హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలన్నారు. కూటమి నాయకులు హిందూ సమాజానికి క్షమాపణ చెప్పకపోతే పార్టీ ఆదేశాల మేరకు భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తామని ఆయన అన్నారు.